సాక్షి
కాకినాడ

శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



వెండి హస్తాల సమర్పణ

సఖినేటిపల్లి: గ్రామంలో వెలసిన కనకదుర్గమ్మ వారికి కనుమూరి రామసీత (సఖినేటిపల్లి) శుక్రవారం రూ.61 వేల విలువైన వెండి హస్తాలు సమర్పించారు.



శఠగోపం బహూకరణ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో ఓనువులమ్మ వారికి గ్రామానికి చెందిన పి.దుర్గాప్రసాద్, ప్రమీల దంపతులు రూ.లక్ష విలువైన శఠగోపం, రెండు వెండి గిన్నెలు సమర్పించారు.

రూ.లక్ష విరాళం



కొత్తపేట: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నప్రసాద భవన నిర్మాణానికి ఉండవల్లి మోహన కార్తిక్, కుటుంబ సభ్యులు (రాజమహేంద్రవరం) రూ.50,116, పసుపులేటి శరత్‌చంద్రబాబు, సుజాత దంపతులు (సికింద్రాబాద్) రూ.50,116 చొప్పున విరాళాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

వ్యక్తిగత విమర్శలు మానుకోండి

వైఎస్సార్ సీపీ నేత వంగా గీతా విశ్వనాథ్



పిఠాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవిపై అసెంబ్లీలో బాలకృష్ణ, కామినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్ తీవ్రంగా ఖండించారు. ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సభను అగౌరవపరచడమేనని మండిపడ్డారు. ఆమె ఇక్కడ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పవిత్రమైన చట్టసభలో ప్రజల సమస్యలు పక్కన పెట్టి ఇతర నాయకుల వ్యక్తిగత జీవితాలపై లేనిపోని మాటలు మాట్లాడటం సరికాదన్నారు. వైఎస్ జగన్ ప్రజల కోసం అహర్నిశలూ కృషి చేస్తూనే ఉంటారని, అటువంటి నాయకుడిపై నోటికొచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలని గీత హితవు పలికారు. ఏళ్ల తరబడి సీఎంగా పని చేసిన చంద్రబాబు హయంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ పేరును కనీసం ఒక జిల్లాకు పెట్టలేకపోయారని దుయ్యబట్టారు. వైఎస్ జగన్ మాత్రమే ఎన్టీఆర్ పేరును ఒక జిల్లాకు పెట్టారని, దీనిని బట్టి ఎవరికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు. వైఎస్ జగన్‌పై నోటికొచ్చినట్టు మాట్లాడటం మానుకోవాలన్నారు. ప్రముఖ సినీ నటుడు చిరంజీవి చాలా సౌమ్యుడని, ఎప్పుడూ ఒక అడుగు తగ్గే ఉంటారన్నారు. వైఎస్ జగన్, చిరంజీవి ఎదుటివారిని గౌరవించే వ్యక్తులని, ఎవ్వరినీ తక్కువ చేయాలనుకునే వారు కాదని స్పష్టం చేశారు. ఆ ఇద్దరినీ చాలా తేలికగా మాట్లాడటం చాలా తప్పని అన్నారు. మహేష్ బాబు డైలాగ్‌లా 'ఎవరైనా అబద్ధం ఆడొచ్చు. కానీ గూగుల్ తల్లి అబద్ధం ఆడదు. మీకు అనుమానం ఉంటే గూగుల్‌లోకి వెళ్లి రికార్డులు తీసి చూడండి. ఎవరేం చేశారో తెలుస్తుంది' అని గీత సూచించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జీఎస్టీ తగ్గింపుపై ఈ నెల 27 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. ఈ అంశంపై కలెక్టరేట్ నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో జీఎస్టీపై హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. జీఎస్టీ తగ్గింపుతో ఏ మేరకు లబ్ధి కలుగుతుందో ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలన్నారు. ప్రతి వారం ఒక థీమ్ తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ జె.వెంకటరావు, జీఎస్టీ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి, జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, డీపీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎగసిపడుతున్న అలలు



తొండంగి: అల్పపీడనం ప్రభావంతో బంగాళాఖాతంలో మండలంలోని దానవాయిపేట, అద్దరిపేట, కొత్తపోడిపల్లిపేట తీరాల్లో సముద్ర అలలు రెండు మీటర్ల వరకూ ఎగసిపడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, సముద్రంలో వేటకు వెళ్లరాదని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు.

వేతన వేదన



విద్యార్థికి పాఠాలు బోధిస్తున్న సీఆర్‌ఎంటీ (ఫైల్)

- సమగ్ర శిక్షలో చాలీచాలని జీతాలు
- ఇబ్బందుల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- కనికరించని కూటమి పాలకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమగ్ర శిక్షలో చిరుద్యోగులైన క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ (సీఆర్ఎంటీ), పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు మండల లెవెల్ అకౌంటెంట్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను భారంగా నెట్టుకొస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలు, ఇంటి అద్దెలు, ఖర్చులతో దిక్కు తోచని పరిస్థితిలో అల్లాడిపోతున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నా జీతాలు పెరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును పాలకులు అమలు చేయకపోవడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లావ్యాప్తంగా మండల వనరుల కేంద్రాల్లో 220 మంది పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, 81 మంది సీఆర్ఎంటీలు (వీరిలో ఇద్దరు మరణించారు), 24 మంది ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, 19 మంది మండల లెవెల్ అకౌంటెంట్లు, 24 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 24 మంది మెసెంజర్లు పని చేస్తున్నారు. వీరందరూ 2012లో ఉద్యోగాల్లో చేరారు. అప్పట్లో వీరికి నెలకు రూ.18,500 వేతనం చెల్లించేవారు. తరువాత వచ్చిన పాలకులు వీరి జీతాల పెంపును విస్మరించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వీరి వేతనాన్ని 2020లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.23,500కు పెంచారు.

కక్ష కట్టినట్టు కూటమి తీరు

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం కక్ష కట్టినట్టుగా కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమమ్ టైమ్‌స్కేల్ వర్తింపజేయరాదని ఈ ఏడాది జనవరిలో జీఓ నంబర్–2 విడుదల చేసింది. ప్రభుత్వ శాఖల్లో మంజూరైన ఖాళీ పోస్టుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమే అర్హులని పేర్కొంది. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కు సూత్రానికి ఈ జీఓ విరుద్ధమని సమగ్ర శిక్ష సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సరైన వేతన నిబంధనలు అమలు కావడం లేదని వాపోతున్నారు.

అమలు కాని హామీలు

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నేతలు గొప్పగా ప్రకటించారు. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత షరా మామూలుగానే మొండిచేయి చూపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్, కొత్త రేషన్ కార్డులు, తల్లికి వందనం వంటి పథకాలను సమగ్ర శిక్షలో పని చేస్తున్న చిరుద్యోగులకు వర్తింపజేయలేదు. ప్రభుత్వం ఓవైపు ఇలా అన్యాయం చేస్తుండగా.. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, రవాణా, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు విపరీతంగా పెరగడంతో ఇస్తున్న జీతాలు సరిపోవడం లేదని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. నెలవారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. తమకు వెంటనే జీతం పెంచాలని, దీంతో పాటు రిటైర్మెంట్ వయసు పెంపు, ఆరోగ్య భద్రత, పిల్లల విద్య, ఇంటి అద్దె భృతి, రేషన్, సంక్షేమ పథకాలు, ఉద్యోగ విరమణ ప్రయోజనాల వంటివి ప్రత్యేకంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

లోకేష్ సార్.. ట్వీట్ మరిచారా!

గత ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబర్ నెలలో మినిమమ్ టైమ్‌స్కేలు అంశంపై సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రస్తుత రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ అప్పట్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళనకు టీడీపీ సంఘీభావం



Lokesh Nara @naralo... · 26 Dec 23

గత ఆరు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహించడం శోచనీయం. మినిమమ్ టైం స్కేల్ విషయంలో జీవోల మీద జీవోలు ఇచ్చి అమలు చేయకపోవడం, ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించే చర్యలకు పాల్పడటం దారుణం. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు తెలుగుదేశం పార్టీ సంఘీభావం తెలియజేస్తోంది. సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.
#WhyAPHatesJagan

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మద్దతుగా గత ప్రభుత్వ హయాంలో లోకేష్ చేసిన ట్వీట్

తెలియజేస్తోందని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ట్వీట్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం నాడు మద్దతు తెలిపి, నేడు అధికారంలోకి వచ్చిన తరువాత తమను పట్టించుకోవడం లేదని చిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు పెంచాలి



జీతాలు పెరగక ఇబ్బందులు పడుతున్నాం. నిత్యావసర ధరలు, రవాణా, వైద్యం, ఇంటి అద్దె వంటి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. కుటుంబ పోషణ భారమవుతోంది. నెలవారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి మా జీతాలు పెంచాలి.

– తరాల మీరాసాహెబ్, సీఆర్‌పీల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలి. చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధ్యాయుల మాదిరిగానే సెలవులు వర్తింపజేయాలి. ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచి, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

– ఎ.రాంజీ ప్రసాద్, సీఆర్‌పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఘనంగా చండీహోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు చండీహోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి గావించారు. వేద పండితులు వేదుల సూర్యనారాయణ, ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు, పరిచారకులు చిట్టెం వాసు, వేణు, వ్రత పురోహితులు చెళ్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, తొలి పావంచా వద్ద కనకదుర్గ అమ్మవారికి పరిచారకుడు నరసింహమూర్తి ఆధ్వర్యాన పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాదులు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

మహిళా శక్తి సంఘాల సొమ్ము గోల్‌మాల్

- బ్యాంక్ సర్వీస్ ప్రొవైడర్ చేతివాటం
- రూ.80 లక్షలకు టోకరా!

కరప: బ్యాంక్ సర్వీస్ ప్రొవైడర్ చేతివాటంతో సుమారు రూ 80 లక్షల మేర మహిళా శక్తి సంఘాల సొమ్ము పక్కదారి పట్టింది. వివరాలివీ.. కరప మండలం కూరాడ గ్రామంలో 106 మహిళా శక్తి సంఘాలున్నాయి. వీటిల్లోని సభ్యులకు వేళంగిలోని యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిల ద్వారా రుణాలు ఇస్తుంటారు. ఇందులో 30 సంఘాలు యూనియన్ బ్యాంక్, 76 సంఘాలు ఎస్‌బీఐ పరిధిలో ఉన్నాయి. తమ ఖాతాదారులకు సేవలందించేందుకు ఎస్‌బీఐ కూరాడలో సర్వీస్ ప్రొవైడర్‌గా చిన్నం భారతిని నియమించింది. ప్రతి నెలా పొదుపు సొమ్ము, తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాలు సొమ్మును మహిళా శక్తి సంఘాలు ఆమెకు చెల్లిస్తుంటాయి. ఆ సొమ్మును భారతి వేళంగి ఎస్‌బీఐ బ్రాంచిలో చెల్లించకుండా సొంతానికి వాడుకోసాగింది. సొమ్మంతా ఒకేసారి నొక్కేస్తే బ్యాంకు అధికారులకు అనుమానం వస్తుందనే ఉద్దేశంతో ఒక పథకం ప్రకారం సొమ్ము కాజేయడం ప్రారంభించింది. ఒక సంఘం రూ.50 వేలు ఇస్తే అందులో రూ.20 వేలు, రూ.80 వేలు చెల్లిస్తే అందులో కొంత మొత్తాన్ని బ్యాంకుకు చెల్లించి, మిగిలింది కాజేసేది. ఇలా ఆ గ్రామంలోని గ్రూపుల నుంచి సుమారు రూ.80 లక్షల వరకు కాజేసిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో భారతి తల్లి అయిన యానిమేటర్ (వీఓఏ) ప్రమేయం కూడా ఉందని గ్రామంలో చర్చించుకుంటున్నారు. మహిళా శక్తి సంఘాల సొమ్ముతోనే కాకినాడలో ఒకటి రెండు ఇళ్ల స్థలాలు కూడా కొనుగోలు చేశారని చెబుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఎస్‌బీఐ సర్వీస్ ప్రొవైడర్ పరారీలో ఉన్నట్టు తెలిసింది.

దుర్వినియోగం నిజమే..

కూరాడలో మహిళా శక్తి సంఘాల సొమ్ము దుర్వినియోగం నిజమేనని ఏపీఎం ఎంఎస్‌బీ దేవి చెప్పారు. దీనిపై ఫిర్యాదు రావడంతో శుక్రవారం ఆ గ్రామంలోను, ఎస్‌బీఐలోను విచారణ జరిపామని, సంఘాల సొమ్మును సర్వీస్ ప్రొవైడర్ పూర్తి స్థాయిలో చెల్లించనట్టు తెలిసిందని చెప్పారు. 26 గ్రూపుల అకౌంట్లు పరిశీలించగా రూ.20 లక్షలు దుర్వినియోగమైనట్టు నిర్ధారణ అయిందన్నారు. మిగిలిన గ్రూపుల అకౌంట్లను శనివారం తనిఖీ చేస్తామని, అనంతరం ఎంత మొత్తం పక్కదారి పట్టిందో తెలుస్తుందని చెప్పారు. ఐదారు గ్రూపులకు సంబంధించి ఒక్కో గ్రూపు నుంచి రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షలు, మిగిలిన గ్రూపుల్లో ఒక్కో దాని నుంచి రూ.20 వేల నుంచి రూ.80 వేల వంతున కాజేసినట్టు అకౌంట్ల తనిఖీలో తెలిసిందని చెప్పారు.

మహాలక్ష్మీ నమోస్తుతే

అన్నవరం: శరన్నవరాత్ర వేడుకలను పురస్కరించుకుని ఐదో రోజైన శుక్రవారం సత్యదేవుని సన్నిధిలో రత్నగిరి దుర్గామాతలైన వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు సిరులొసంగే శ్రీమహాలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు. పద్మంలో ఆశీనులై, ఆకుపచ్చ రంగు చీరలు ధరించి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారితో పాటు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దర్బారు మండపంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ రుత్విక్కులు శ్రీసూక్త, పురుషసూక్త, మన్యుసూక్త, లలితా, విష్ణు సహస్రనామ పారాయణలు చేశారు. లింగార్చన, నవావరణార్చన, సూర్య నమస్కారాలు నిర్వహించారు. యంత్రాలయంలో శ్రీమహా వైకుంఠ నారాయణ విభూతి యంత్రానికి పూజలు చేశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ సత్యదేవుని ప్రధానాలయంతో పాటు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్ల ఆలయాల్లో లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకూ సత్యదేవుని ప్రధానాలయంలో అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాదులు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగబాబు, యనమండ్ర శర్మ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



లోవలో..

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారిని కూడా మహాలక్ష్మీ దేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దాపురం ఆర్‌డీఓ కె.శ్రీరమణి, పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. దసరా వేడుకల్లో ఆరో రోజైన శనివారం అమ్మవారిని లలితాదేవిగా అలంకరించనున్నట్లు వేదపండితులు, ప్రధానార్చకులు తెలిపారు.





అన్నవరంలో లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన కనకదుర్గ, వనదుర్గ, తుని తలుపులమ్మ అమ్మవార్లు

ధాన్యం కొనుగోలుపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై అధికారులకు అవగాహన అవసరమని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ధాన్యం కొనుగోలు శిక్షణ తరగతులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ధాన్యం కొనుగోలుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, నాణ్యతా ప్రమాణాల అమలు, కనీస మద్దతు ధర, గోనె సంచులు, మండల స్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ ఏర్పాటు, కస్టోడియన్ అధికారుల నియామకం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా రైస్ మిల్లులకు తరలింపు, ఈ–క్రాప్ బుకింగ్ వంటి అంశాలపై మండల స్థాయి అధికారులకు జేసీ అవగాహన కల్పించారు. జిల్లాలో 269 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో అవసరమైన సిబ్బంది, తేమ శాతం కొలిచే యంత్రాలు, గోనె సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. దళారులు, మిల్లర్ల చేతిలో నష్టపోకుండా కనీస మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 85 శాతం ఈ–పంట నమోదు పూర్తయిందని, మిగిలినది ఈ నెల 30 నాటికి పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవల నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయ్ కుమార్, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, జిల్లా సహకార అధికారి బి.శ్రీనివాసరెడ్డి, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కమిషనర్ ఎన్.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మను మరువకండి

- రోజుకు 24 నిమిషాలు కేటాయించండి
- పరిపూర్ణానంద స్వామి
- శ్రీపీఠంలో 60 కోట్లకు చేరిన కుంకుమార్చనలు
- 50 వేల మంది మహిళలు హాజరు

కాకినాడ రూరల్: 'అమ్మ ఒక శక్తి. అమ్మ ఒక అద్భుతం. అన్నీ ఉన్నా అమ్మను మాత్రం మరువకండి. ప్రతి రోజూ గంటకు ఒక నిమిషం చొప్పున 24 నిమిషాలు అమ్మకు కేటాయించి, ఆమెను స్మరిస్తే మీ మెదడులో గామా వేవ్స్ యాక్టివేట్ అవుతాయి. మహా ఆనందం కలుగుతుంది' అని కాకినాడ శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి అన్నారు. రమణయ్యపేటలోని శ్రీపీఠంలో మహాశక్తి యాగం మూడో సంవత్సరం వంద కోట్ల కుంకుమార్చనలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఐదో రోజు శుక్రవారం, పంచమి రావడంతో సుమారు 50 వేల మంది మహిళలు దీక్షా వస్త్రాలతో ఈ పూజలకు తరలివచ్చారు. వారి సంఖ్యకు తగినట్టుగా కుంకుమ పూజలకు ఏర్పాట్లు చేసి, అనంతరం మహా ప్రసాదం అందించారు. పీఠం అధిష్ఠాన దేవత ఐశ్వర్యాంబిక అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సౌభాగ్య పూజ, సాయంత్రం దుర్గా సూక్త, ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపూర్ణానంద స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ, శ్రీపీఠం స్త్రీ శక్తి పీఠమని, ఇక్కడ ఐశ్వర్యాంబిక అమ్మవారు అన్నీ నడిపిస్తున్నారని అన్నారు. వందల కోట్ల కుంకుమార్చనలు జరిగే తపోభూమిగా ఈ ప్రాంతం మారిందని చెప్పారు. ఎన్నో వందల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో ఏదో ఒక తపస్సు జరిగి ఉంటుందని, లేకపోతే ఇన్ని వేల మందితో పూజలు జరుగుతాయా అని అన్నారు. 64 లక్షల కోట్ల తపస్సుల సారమే లలితా సహస్ర నామాలు అని చెప్పారు. అమ్మ అనుగ్రహం అందరికీ ఉండాలని ఆశీర్వదించారు.

అయోధ్య బాలరాముని విగ్రహానికి పూజలు

శ్రీపీఠంలో వంద కోట్ల కుంకుమార్చనల వేదికకు అయోధ్యలో స్థిరపడిన చల్లా శ్రీనివాసశాస్త్రి అక్కడి నుంచి బాలరాముని బంగారు ఉత్సవ విగ్రహం, పాదుకలు, ధనుర్బాణాలు తీసుకు వచ్చారు. వాటికి పరిపూర్ణానంద స్వామి పూజలు చేశారు. మహాశక్తి యాగంలో అయోధ్య రాముని ఆయుధాలు, పాదుకలు రావడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి ఆయననే స్వయంగా విగ్రహంగా వచ్చారని చెబుతూ, ఒక్కొక్కటీ భక్తులకు చూపించారు. మొదటి సంవత్సరం పాదుకలు, రెండో సంవత్సరం ధనుర్బాణాలు, మూడో సంవత్సరం స్వయంగా బంగారు రాముడే వచ్చాడని ఆనందం వ్యక్తం చేశారు. స్వామి వారి కోసం అనేక విగ్రహాలు తంజావూరులో తయారు చేయిస్తున్నానని, అయోధ్య వచ్చేవారికి వసతి, భోజనం ఉచితంగా ఏర్పాటు చేస్తానని చల్లా శ్రీనివాసశాస్త్రి తెలిపారు.

ఐశ్వర్య రక్ష కంకణాలకు పూజ

మహాశక్తి యాగంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న భక్తులకు తన తల్లి దాచుకున్న సొమ్ముతో ఐశ్వర్య రక్ష కంకణాలు తయారు చేయించి, అందించనున్నట్లు పరిపూర్ణానంద స్వామి ముందుగానే ప్రకటించారు. ఆ మేరకు స్వచ్ఛమైన రాగితో తయారు చేసిన కంకణాలను మహాశక్తియాగం వేదికపై లలితా అమ్మవారి విగ్రహం ముందుంచి పూజలు నిర్వహించారు.



అయోధ్యలో సమర్పించనున్న బాలరాముని విగ్రహం, ధనుర్బాణాలు, పాదుకలకు హారతి ఇస్తున్న పరిపూర్ణానంద స్వామి



కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు



కుంకుమ పూజలకు తరలివస్తున్న భక్తులు

లక్ష్మీదేవి లక్షణంగా..

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని, ఆలయాన్ని రూ.4.42 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకరించారు. పట్టణ వైశ్య సంఘం, ఆలయ ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో కరెన్సీ నోట్ల కట్టలు, రూ.5, రూ.10, రూ.20 నాణేలను అమ్మవారి సన్నిధిలో ప్రదర్శనగా ఉంచారు. వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అప్పన వీరన్న, గౌరవాధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య తదితరులు సేవలందించారు.

నల్లజర్ల: మండలం పోతవరంలో చావారామకృష్ణ వీధిలో విజయ కనకదుర్గమ్మ మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి రూ.16 లక్షల విలువైన నోట్లతో అద్భుతంగా అలంకరించారు. వేదపండితులు సతీష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ముమ్మిడివరం: మండలం శివారు గోదశివారిపాలెంలో అమ్మవారిని రూ.30 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు.

కరప: మండలం అరట్లకట్ట గ్రామంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మిగా దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు కొంతేటి సత్యనారాయణమూర్తి, కొంతేటి శివ, ఆలయకమిటీ, భక్త బృందం ఆధ్వర్యంలో అమ్మవారిని, ఆలయంలోని దేవతా మూర్తులను రూ 8 లక్షలు విలువచేసే కరెన్సీనోట్లతో అలంకరించారు.


రూ.4.42 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకృతమైన అమలాపురం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీదేవి


గోదశివారిపాలెంలో రూ.30 లక్షలతో..


రూ.16 లక్షలతో పోతవరంలోని కనకదుర్గమ్మ..


అరట్లకట్ట శివాలయంలో భ్రమరాంబిక అలంకరణ రూ.8 లక్షలతో

క్లుప్తంగా

సంపద తయారీపై అవగాహన అవసరం


వర్మీ కంపోస్టు తయారీపై ఎంపీడీఓలకు అవగాహన కల్పిస్తున్న ఫ్యాకల్టీలు

సామర్లకోట: సంపద తయారీ కేంద్రాలపై ఎంపీడీఓలకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని విస్తరణ శిక్షణ కేంద్రం సీనియర్ ఫ్యాకల్టీలు ఎస్ఎస్ శర్మ, కె.శేషుబాబు, జగన్నాథం అన్నారు.

స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో పదోన్నతి పొందిన ఎంపీడీఓలు ఈ నెల 8వ తేదీ నుంచి శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో భాగంగా జి.రాగంపేటలోని వర్మీ కంపోస్టు యూనిట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈటీసీ టెక్నికల్ ఫ్యాకల్టీ ఎస్‌కే మోహిద్దీన్, రాగంపేట పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

దసరాల్లో అల్లల్లాచ్చికి..!

'ఏరా.. హోంవర్క్ చేశావా.. లేదా.. గెటౌట్ ఫ్రం క్లాస్ రూం'.. ఓ పిల్లాడిపై మాస్టారి అరుపు. 'ఏవండీ ఆ ఫైల్ రెడీ అయ్యిందా.. ఇంకా ఎంతసేపండీ ఫైవోక్లాక్‌కి జీఎంతో మీటింగ్ ఉంది.. స్పీడుగా కానియ్యండి'.. ఓ ఉద్యోగిపై ఆయన బాస్ అదిలింపు. ఏమేవ్.. లంచ్‌బాక్స్ రెడీ అయ్యిందా.. క్యాబ్ వచ్చేసింది..' 'ఆ.. ఇదుగో వచ్చేస్తున్నానండీ.. అయిపోయింది..' ఓ భార్యాభర్తల ఉదయపు హడావిడి.. పొద్దున్న లేచింది మొదలు రాత్రి వరకు ఆ పనులవ్వకపోతే భూమి బద్దలైపోతుందన్నట్టు ప్రతి చోటా ఇవే అరుపులు కేకల జీవితం. ఏ ఉదయమూ మృదువైన సంభాషణలు మచ్చుకు కూడా వినపడని రోజుల్లోకి వెళ్లిపోయారు మనుషులు. ఆ ఉరుకుల పరుగుల జీవితాలకు రీచార్జింగే సెలవులు. ఎక్కడో బద్ధకిష్టులు తప్ప అత్యధికులు వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అటో.. ఇటో.. ఎటో పిల్లా పాపలతో బయటకు అలా అలా తిరిగొచ్చేవారే. ఇదిగో దసరా సెలవులొచ్చాయిగా.. మనవాళ్ల ప్రణాళికలేంటో చూసొచ్చేద్దామా..


హంపి విజయనగరం అందాలను కెమేరాలో బంధిస్తున్న పర్యాటకుడు


మైసూర్ బృందావన గార్డెన్స్‌లో మ్యూజికల్ లైటింగ్

- ఉరుకుల జీవితం నుంచి ఊళ్లకు సరదాగా
- కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి పర్యటనలు
- చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా ఉల్లాసంగా పయనం
- సెలవులు సద్వినియోగం

రాయవరం: జీవితం ఉరుకుల పరుగులమయమైంది. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు ఎన్నో ఒత్తిళ్లు.. ఆలోచనలు చుట్టుముట్టేస్తున్నాయి. పిల్లల పుస్తక పోరాటం మరీను. పాఠశాల.. అనంతరం హోంవర్క్ పేరుతో రాత్రంతా మేల్కొని ఉండడం. అందరికీ కాస్త విరామం దొరికేది సెలవుల్లోనే. ఉరుకుల పరుగుల జీవితానికి కాస్త విరామం ఇచ్చి ఓ మంచి ఆరామాన్ని ఎంచుకుని రిఫ్రెష్ అవ్వాలని చూస్తుంటారు. జిల్లాలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలకు వెళ్లే వారు కొందరైతే, మరికొందరు, దేశ, విదేశాల్లో విహరించడానికి ప్రణాళికలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం దసరా సెలవులు 10 రోజుల పైబడి రావడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావాసులు ఎటువంటి ప్రదేశాలకు వెళ్తున్నారో 'సాక్షి' కథనం.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం కోసం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న ఎన్నో ఆలయాల్లో దైవ దర్శనాలు చేసుకోవడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతతో పాటు మనసు కుదుట పడుతుందని పలువురు భావిస్తున్నారు. అలాగే ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే పాపికొండలు, మారేడుమిల్లి, రంపచోడవరం, సముద్ర తీరప్రాంతాలైన కాకినాడ, అంతర్వేది బీచ్ వంటి ప్రదేశాలతో పాటుగా, ఇతర జిల్లా, రాష్ట్రాల్లోని అరకు, నాగార్జునసాగర్, తమిళనాడు, కేరళ, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లోని ఆహ్లాదకర ప్రాంతాలను చుట్టి వచ్చేందుకు పయనమవుతున్నారు. ఇక రిజర్వేషన్లు సహకరిస్తే వారణాసి, అయోధ్య వంటి ప్రాంతాలకు కూడా ప్రణాళికలు వేసుకుంటున్నారు. మరికొందరు సింగపూర్, మలేషియా, శ్రీలంక, దుబాయ్, థాయ్‌లాండ్ వంటి దేశాలను చుట్టి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ముందుగానే ప్లాన్ చేసుకుంటాం



ఏటా దసరా, సంక్రాంతి, వేసవి సెలవులకు తప్పనిసరిగా టూర్ వెళ్తాం. ఓసారి ఆధ్యాత్మికం, ఓసారి ఆహ్లాదకర టూర్స్ చేస్తుంటాం. ఈసారి దసరా సెలవుల్లో ముంబై, పూణే ప్రదేశాలు చూసేందుకు వెళ్తున్నాం. మిత్రులతో కలసి పర్యాటక ప్రదేశాలు చూసేందుకు వెళ్తున్నాం. ఈ పర్యటనలతో ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగి మరింత ఉత్సాహంగా పనిచేయగలుగుతున్నాం.

– పితాని శ్రీనివాస్,
టీచర్, జెడ్పీహెచ్ఎస్,
కె.గంగవరం మండలం

కొత్త విషయాలను తెలుసుకుంటాం



ఏటా పర్యాటక ప్రదేశాలకు కుటుంబ సభ్యులతో వెళ్తుంటాను. వీటి ద్వారా పిల్లలకు విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచుతున్నట్లవుతుంది. కొత్త విషయాలను తెలుసుకుంటారు. తెలుసుకున్న విషయాలను పాఠశాలల్లో చిన్నారులకు ఫొటోలు, వీడియోలు చూపించి, అక్కడ విషయాలను తెలియజేస్తాను.

– నయనాల శ్రీనివాసరావు,
స్కూల్ అసిస్టెంట్,
వీరవల్లిపాలెం,
అయినవిల్లి మండలం.

పర్యాటక వాహనాలకూ డిమాండ్

ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలను, ఇతర జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ఒక రోజులో సందర్శించి వస్తున్నారు. సొంత కార్లు ఉన్న వారే కాకుండా.. మరికొందరు రోజువారీగా అద్దె వాహనాలపై పర్యాటక ప్రాంతాల్లోని అందాలు చూసి వస్తున్నారు. మరికొందరు క్రూజ్ టూర్‌కు ఆసక్తి కనబరుస్తున్నారు. సముద్రంలో ఓడలో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విశాఖపట్నం నుంచి చెన్నై, శ్రీలంక, అండమాన్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

చిక్‌మగుళూర్ వెళ్తున్నా



ప్రతిసారి సెలవులకు విహార యాత్రకు వెళ్లడం అలవాటు. గతంలో శ్రీకాకుళం జిల్లాలోని శాలిహుండం, ఒడిశాలోని కోణార్క్ టెంపుల్, కర్ణాటకలోని హంపి, బాదామి, పట్టడికల్ వంటి చారిత్రక ప్రదేశాలు తిలకించాం. ఈసారి దసరా సెలవులకు చిక్‌మగుళూర్ కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి హిల్ స్టేషన్‌కు కారులోనే వెళ్తున్నాం.

– జానా సురేష్‌కుమార్, ఎస్‌జీటీ, వల్లాయిచెరువు,
పెదగాదవిల్లి, ఉప్పలగుప్తం మండలం

బ్యాంకాక్ పర్యటన మరువలేనిది



మిత్రులతో కలసి చేసిన బ్యాంకాక్ పర్యటన సరికొత్త అనుభూతులనునిచ్చింది. అక్కడ సముద్రంలో అరగంట ప్రయాణించిన తర్వాత సముద్రం లోపల ఉన్న మ్యూజియంలో రకరకాల చేపలు చూసి ఆశ్చర్య పోవాల్సిందే. అలాగే బౌద్ధ దేవాలయాలు కూడా చూడ ముచ్చటగా ఉంటాయి. బోట్ రైడింగ్, వాటర్‌లో స్కై డైవింగ్ వంటి అంశాలు మరపురానివి.

– సాపిరెడ్డి విశ్వనాథ బాలాజీ (దొరబాబు),
యర్రపోతవరం, కె.గంగవరం మండలం

రూ.3.8 లక్షల విలువైన ఆభరణాల చోరీ


కపిలేశ్వరపురంలో చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ దొరరాజు

కపిలేశ్వరపురం: స్థానిక చప్పిడి శ్యామ్‌ప్రసాద్ ఇంటిలోని రూ.3.8 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అంగర పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు శ్యామ్ ప్రసాద్, ధనలక్ష్మి దంపతులు ఈ నెల 23న వేరే ఊరిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూశారు. బీరువా తెరిచి సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.2.5 లక్షల విలువైన 25 గ్రాముల బంగారం, రూ.1.3 లక్షల విలువైన 32 తులాలు వెండి అపహరించుకుపోయారు. బాధితులు ఫిర్యాదుపై మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్సై జి.హరీష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అమలాపురం నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


మనోహర్ (ఫైల్)

యానాం: పట్టణ పరిధిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పునీత్‌రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు మండలం పటవల, రాఘవేంద్రపురానికి చెందిన 25 ఏళ్ల పేరాబత్తుల మనోహర్ ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదని సాపిరెడ్డి శివవరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదృశ్యమైన మనోహర్ ఆ రోజు బైక్‌పై ఇంటినుంచి యానాం బాలయోగివారధి వద్ద దొడ్డి గంగమ్మ ఆలయం వద్దకు వచ్చాడని అప్పటి నుంచి ఆయన కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వివరాలు తెలిసిన వారు యానాం ఎస్పీకి 0884–2324800, 2321 210 నంబర్‌లో తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

వెదురు సాగు లాభదాయకం


ప్రాంతీయ అటవీ పరిశోధన కేంద్రంలో పెంచుతున్న వెదురు రకాలను పరిశీలిస్తున్న చౌడప్ప

రాజానగరం: వెదురును సాగు ద్వారా ఎకరానికి రూ.ఒక లక్ష ఆదాయాన్ని పొందవచ్చని సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీపీసీఆర్ఐ) విశ్రాంత సంచాలకుడు పి.చౌడప్ప అన్నారు. లాలాచెరువు సమీపంలోని ప్రాంతీయ అటవీ పరిశోధన కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, అక్కడ పెంచుతున్న వివిధ రకాల వెదురు జాతుల మొక్కలను పరిశీలించారు. వెదురు మొక్కలను బయోచార్ ప్రిపరేషన్, అగర్‌బత్తీల తయారీ వంటి విభిన్న రంగాలలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారన్నారు. జిల్లా ఉద్యాన విభాగం అధికారి ఎస్.మల్లికార్జునరావు మాట్లాడుతూ వెదురు సాగు చేసే రైతులకు పలు రకాల సబ్సిడీలు ఉన్నాయన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే పంటగా ఈ సాగు ఎంతో అనువైనదని పేర్కొన్నారు. ఉద్యాన శాఖ అధికారి కొవ్వూరు సుధీర్, మండల శాఖ అధికారి నాగదేవి, వేణుమాధవ్, అటవీ శాఖ రేంజర్ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై అగ్నిప్రమాదం


దగ్ధమవుతున్న ఫ్యాన్సీ దుకాణం


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేసీ త్రినాథరావు, ఈఓ సుబ్బారావు

- ఫ్యాన్సీ దుకాణం గోదాములో ఘటన
- రూ.పది లక్షల ఆస్తి నష్టం
- ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమంటున్న అధికారులు

అన్నవరం: రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం వద్ద గల ఫ్యాన్సీ షాపు గోడౌన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించి సుమారు రూ.పది లక్షల ఆస్తి నష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే ఫ్యాన్సీ షాపు నిర్వాహకుడు దాని వెనుక గోడౌన్ ఏర్పాటు చేసుకుని ప్లాస్టిక్ వస్తువులు, ఫొటోలు, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లు పెట్టుకున్నాడు. ఉదయం ఏడు గంటల సమయంలో ఆ గోడౌన్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి వస్తువులు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో 8 ఫ్రిజ్‌లతో సహా సుమారు రెండు లారీల సరకు కాలి బూడిదైంది. సకాలంలో ఫైర్ ఇంజన్ రాకపోయి ఉంటే షాపింగ్ కాంప్లెక్స్‌కు మంటలు వ్యాపించి రూ.కోట్లలో నష్టం వాటిల్లేదని స్థానికులు చెప్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఈ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఈ విషయం తెలియగానే దేవదాయశాఖ ఆర్‌జేసీ వి.త్రినాథరావు, పెద్దాపురం ఆర్డీఓ రమణి వచ్చి ఆ గోడౌన్‌ను పరిశీలించారు. ప్రమాద వివరాలను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు వారికి వివరించారు.

సందడి చేసిన 'అనగనగా ఒక రాజు'

జి.మామిడాడలో పోలిశెట్టి నవీన్ చిత్రం షూటింగ్

పెదపూడి: జి.మామిడాడలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. హీరో పోలిశెట్టి నవీన్ హీరోగా, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా సితార ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణంలో అనగనగా ఒక రాజు సినిమా షూటింగ్ శుక్రవారం జరిగింది. ఈ సినిమాకు మారి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన జాతిరత్నాలు చిత్రానికి ఆయన రైటర్‌గా పనిచేసి తొలిసారి ఈ చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. మూడురోజులుగా ఎల్ఎస్‌పురంలో ఈ షూటింగ్ సాగుతోంది. జబర్దస్త్ ఆర్టిస్టులు చమ్మక్ చంద్ర, భద్రం, మహేష్, రోహిణీ, సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్‌గా నవీన్ (రాజు) ఓట్లు అభ్యర్థించే సన్నివేశాలు, ఎన్నికల ప్రచారంలో భాగంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడే సన్నివేశాలను చిత్రీకరించారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు సినీ వార్గాలు తెలిపాయి.


హీరో పోలిశెట్టి నవీన్‌పై చిత్రీకరిస్తున్న సన్నివేశం

29న నిధి ఆప్‌కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌ఓ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటలకు నిధి ఆప్‌కే నికట్–డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో ద్వారకాతిరుమలలో శ్రీ సర్వారాయ షుగర్స్ లిమిటెడ్, బాట్లింగ్ యూనిట్‌లోను, పశ్చిమగోదావరి జిల్లాలో పాలకొల్లు సంధ్య మెరైన్‌లోను, కాకినాడ జిల్లాలో తుని శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో యానాం అడవిపాలెంలోని వాసవీ పిగ్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లోను, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి వెంకటాపురంలోని జీఎస్ఎల్ ఎడ్యుకేషనల్ సొసైటీలోను, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పట్నాయక్ తెలిపారు. 'ఈపీఎఫ్ఐ ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ', ఇతర ఫిర్యాదు దాఖలు నిబంధనలు, క్లెయిమ్ తిరస్కరణ కారణాలు, స్కీమ్ సర్టిఫికెట్ ప్రయోజనాల వంటి అంశాలను వివరించడం, పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎగ్జంప్టెడ్/నాన్-ఎగ్జంప్టెడ్), కొత్తగా కవర్ చేయబడిన ఎస్టాబ్లిష్మెంట్‌లకు చెందిన వారు తమ ఫిర్యాదులను 'నిధి ఆప్ కే నికట్' అని పేర్కొంటూ సమర్పించవచ్చునని తెలిపారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ బకాయి ఉన్న పింఛనుదారులు ఈ శిబిరంలో సమర్పించవచ్చునని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు.

వరకట్నం వేధింపులతో చంపేశారు

రాజానగరం: తన కుమార్తెను అత్తింటి వారు వరకట్నం కోసం తరచు వేధించడమే కాకుండా ఆమెను నిర్దాక్షిణ్యంగా చంపేశారని పాయకరావుపేటకు చెందిన షేక్ వలీ రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి స్థానిక ఎస్సై జీవీవీ సత్యనారాయణ శుక్రవారం మీడియాకు తెలిపిన వివరాలివి. మండలంలోని పాత నామవరానికి చెందిన సయ్యద్ బషీరుద్దీన్‌కు షేక్ వలీ దంపతులు తమ కుమార్తె సయ్యద్ హీరా (22)తో ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా హీరా భర్త బషీరుద్దీన్, అత్తమామలు సయ్యద్ హముదున్నీసా, బాజీలు తిట్టడం, కొట్టడం చేస్తుండేవారు. గత ఆదివారం తమ కుమార్తెను చూసేందుకు వచ్చిన తల్లికి అత్తింటి వారు పెడుతున్న హింసల గురించి చెప్పి ఏడ్చింది. అయినప్పటికీ సర్దుకుపోవాలని తన కుమార్తెను ఓదార్చి ఆమె వెళ్లిపోయింది. కాగా శుక్రవారం ఆమె చనిపోయింది. ఈ విషయం తెలుసుకుని పాతనామవరం వచ్చిన మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆమె మరణం సహజమైనది కాదని, అత్తింటి వారే చంపి ఉంటారని అనుమానాన్ని వ్యక్తపరుస్తూ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.